సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం। 15। ఏప్రిల్। 2025



చీనీ టన్ను రూ.20,100

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.20,100, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



పేదలనెత్తిన గుదిబండ

గ్యాస్‌సిలిండర్‌పై రూ.50 పెంచి ప్రభుత్వం నిరుపేదలకు షాక్ ఇచ్చింది. పెరిగిన ధరతో జిల్లా వాసులపై ఏటా రూ.24.25 కోట్ల భారం పడనుంది.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
40.4°/20.6°

జిల్లాలో సోమవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీల మార్క్‌ను దాటింది. భానుడి భగభగలతో వేసవి తాపం కొనసాగుతోంది. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్వింటా చింతపండు రూ.25 వేలు



మార్కెట్‌కు వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: చింతపండు ధరలు మార్కెట్‌లో నిలకడగా కొనసాగుతున్నాయి. సోమవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 1024.20 క్వింటాళ్ల చింత పండు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో కరిపులి రకం చింతపండు క్వింటా గరిష్ఠంగా రూ.25 వేలు, కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరిన రూ.12 వేల ప్రకారం ధర పలికింది. ఇక ఫ్లవర్ రకం క్వింటా గరిష్ఠంగా రూ. 12,500, కనిష్ఠంగా రూ.4 వేలు, సరాసరిన రూ.11 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. మార్కెట్‌కు నాణ్యమైన చింతపండు తీసుకువచ్చి అధిక ధర పొందాలని కార్యదర్శి రైతులకు సూచించారు.

హెచ్‌ఎం పదోన్నతుల సీనియార్టీ జాబితా సిద్ధం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా పరిషత్, మునిసిపాలిటీ, అనంతపురం కార్పొరేషన్‌లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించేందుకు సీనియార్టీ జాబితాను తయారు చేశారు. deoananthapuramu.blogspot.com వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ ప్రసాద్ బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే ఆధారాలతో ఈనెల 19లోపు ఫిర్యాదు చేయాలని డీఈఓ సూచించారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ



ఎస్పీ రత్నకు బొకే అందజేస్తున్న డీఎస్పీ నరసింగప్ప

పుట్టపర్తి టౌన్: పెనుకొండ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నరసింగప్ప సోమవారం ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెనుకొండ సబ్ డివిజన్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని డీఎస్పీకి ఎస్పీ సూచించారు. ముఖ్యంగా మట్కా, పేకాటను పూర్తిగా అరికట్టాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.

బడుగులపై పచ్చ బలుపు

ఆధిపత్యం కోసం అకృత్యాలకు దిగుతున్నారు. తమ బలం చూపించేందుకు బడుగులపై దాడులు చేస్తూ బలి తీసుకుంటున్నారు. నిన్న కురుబ లింగమయ్య, తాజాగా ఆనంద్.. ఇద్దరిపైనా దాడి చేసింది 'పరిటాల' వర్గమే. పట్టుకోసం అటు రాప్తాడు, ఇటు ధర్మవరంలో హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. ముఖ్యనేతల జోలికెళ్లే ధైర్యం లేక అమాయకులైన బీసీలపై దాడులు చేస్తూ భయకంపితులను చేస్తున్నారు.

- 'ధర్మవరం'లో 'తమ్ముళ్ల' దాష్టీకం
- రామగిరి తరహాలో 'పరిటాల' అనుచరుల బరితెగింపు
- బీజేపీ కార్యకర్త కురుబ ఆనంద్‌పై దాడి
- తీవ్రంగా గాయపరిచి.. బెదిరించిన వైనం
- 'పరిటాల' దెబ్బకు బీసీ కులస్తుల బెంబేలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్

కూటమి పార్టీల నేతలు పైన పొత్తులో కనిపిస్తున్నా.. లోన కత్తులు నూరుతున్నారు. మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలో తరచూ టీడీపీ, బీజేపీ నేతల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. నియోజకవర్గంలో బీజేపీ పెత్తనాన్ని టీడీపీ నేతలు ఓర్వలేకపోతున్నారు. ఈ క్రమంలో ఆధిపత్యం కోసం బీజేపీ నేతలపై తరచూ దాడులకు తెగబడుతున్నారు. ముఖ్యంగా బీసీ సామాజిక వర్గాల నేతలనే టార్గెట్ చేస్తున్నారు. ఓటు బ్యాంకు ఆధారంగా ప్రాధాన్యం ఇవ్వాలని 'తెలుగు తమ్ముళ్లు' డిమాండ్ చేస్తుండగా.. ఎమ్మెల్యే మావాడు...మాకే ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి.



శ్రీరామ్ అనుచరుల దాష్టీకం..

ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అండతో ఆయన అనుచరులు నానా హంగామా చేస్తున్నారు. బీజేపీ నాయకులను భయపెట్టేందుకు బీసీ కులాలను టార్గెట్ చేసుకుని దాడులకు దిగుతున్నారు. మద్యం దుకాణాల నిర్వహణ మొదలుకుని.. ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్ డీలర్ల నియామకం.. ఇలా ప్రతి విషయంలో బీజేపీ నేతల పెత్తనాన్ని ఎక్కడికక్కడ.. ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ వస్తున్నారు. ఎక్కడైనా ఎదురుతిరిగితే దాడులకు తెగబడుతున్నారు. ఈ క్రమంలోనే తాడిమర్రి మండలంలో మద్యం దుకాణం నిర్వహణలో బీజేపీ నేతలను రెండు నెలల పాటు పరిటాల శ్రీరామ్ అనుచరులు అడ్డగించిన సంగతి తెలిసిందే.

పాపిరెడ్డిపల్లి తరహాలోనే..

పరిటాల శ్రీరామ్ అండతో టీడీపీ గూండాలు రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఉగాది రోజున కురుబ లింగమయ్యపై దాడి చేసి దారుణంగా హత్య చేశారు. అదే తరహాలో పెద్దకోట్లలో కురుబ కులానికి చెందిన ఆనంద్‌పై దాడికి దిగినట్లు తెలిసింది. పాపిరెడ్డిపల్లి తరహాలోనే పెద్దకోట్లలో కూడా 'పరిటాల' సామాజిక వర్గానికి చెందిన వారే దాడికి దిగడం గమనార్హం. పరిటాల శ్రీరామ్ అనుచరుల బెదిరింపులతో రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో బీసీ కులాల నేతలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

బీసీ నేతలే టార్గెట్..

నెల రోజుల క్రితం ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ వాహనంపై పరిటాల శ్రీరామ్ అనుచరులు దాడికి దిగారు. ఒకే కూటమిలో ఉన్నప్పటికీ ఇరు పార్టీల మధ్య సఖ్యత లేదనే విషయం బహిర్గతమైంది. తాజాగా తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామంలో బీసీ కులానికి చెందిన ఆనంద్‌ను టీడీపీ నేతలు చితకబాదారు. ఆదివారం సాయంత్రం గొడవ జరగడంతో అదేరోజు రాత్రి ధర్మవరం ఆస్పత్రిలో చేరాడు. అయితే విషయం బయటకు పొక్కుతుందని భావించిన టీడీపీ నేతలు ఆస్పత్రిలో ఉన్న ఆనంద్‌కు వార్నింగ్ ఇవ్వగా..రాత్రికి రాత్రే ఆయన డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నాడు.

ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తారా?

- ఆర్వేటి ఆనంద్‌పై టీడీపీ నేతల దాడి దుర్మార్గం
- దుండగులపై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ, కురుబ సంఘం నాయకుల డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ధర్మవరం/తాడిమర్రి: తమ అక్రమాలను ప్రశ్నిస్తే ప్రాణాలు తీసేందుకు కూడా టీడీపీ నేతలు వెనుకాడటం లేదని బీజేపీ, కురుబ సంఘం నాయకులు మండిపడ్డారు. తమ దురాగతాలను బయటపెట్టినందుకే బీజేపీకి చెందిన కురుబ ఆర్వేటి ఆనంద్‌పై టీడీపీ నాయకులు దాడి చేశారన్నారు. మండలంలోని పెద్దకోట్ల గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కురుబ ఆర్వేటి ఆనంద్‌పై ఆదివారం టీడీపీ నాయకులు దాడి చేశారు. సోమవారం బాధితుడిని పరామర్శించిన బీజేపీ మండల నాయకులు, కురుబ సంఘం నాయకులు అనంతరం ధర్మవరం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ధర్మవరం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంకా నాగార్జున మాట్లాడుతూ.. తాడిమర్రి మండలం బీజేపీ ప్రధాన కార్యదర్శి పెద్దకోట్లకు చెందిన కురుబ ఆర్వేటి ఆనంద్ గ్రామానికి చెందిన మత్స్యకారుల సొసైటీలో సభ్యుడిగా ఉన్నారన్నారు. మత్స్యకార సొసైటీలోని కొందరు సభ్యులు మత్స్య సంపదను రాజమండ్రికి చెందిన కాంట్రాక్టర్‌కు అప్పజెప్పాలని నిర్ణయించారన్నారు. దీనివల్ల గ్రామానికి గానీ, స్థానిక మత్స్యకారులకు ఎలాంటి ఆదాయం రాదన్నారు. దీంతో ఆర్వేటి ఆనంద్ టీడీపీ నేతల నిర్ణయానికి అడ్డుచెప్పారన్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు ఆదివారం మద్యం సేవించి వచ్చి మరణాయుధాలతో ఆర్వేటి ఆనంద్‌పై దాడి చేశారన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బత్తలపల్లి జెడ్పీటీసీ కోటి సుధ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కాటమయ్య, బీజేపీ నాయకులు దేవర రామ్మోహన్, వీరనారప్ప, బిల్లే శ్రీనివాసులు, గొట్లూరు అనీల్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై

'తమ్ముళ్ల' దాడి

- వాట్సాప్ స్టేటస్‌లో జగన్ పాట పెట్టాడని దౌర్జన్యం
- అడ్డువచ్చిన భార్యనూ అసభ్యపదజాలంతో దూషణ
- మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన బాధితుడు



కదిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబ్‌జాన్

ధర్మవరం: వైఎస్సార్ సీపీ కార్యకర్త తన వాట్సాప్ స్టేటస్‌లో వైఎస్ జగన్ పాట పెట్టడాన్ని జీర్ణించుకోలేని టీడీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేశారు. అడ్డువచ్చిన అతని భార్యనూ అందరి ముందు అసభ్యపదజాలంతో దూషించారు. అవమానంగా భావించిన బాధితుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన ముదిగుబ్బలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... ముదిగుబ్బ గేట్ కొట్టాల వద్ద నివాసం ఉంటున్న బాబ్‌జాన్ వైఎస్సార్ సీపీ కార్యకర్త. టైల్స్ పరిచే పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఇటీవల బాబ్‌జాన్ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ పాటలను తన వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకుంటున్నాడు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ కార్యకర్తలు బాజీజాన్‌ను పిలిపించి మరోసారి జగన్ పాట స్టేటస్ పెడితే ఊరుకునేది లేదంటూ ఇటీవల హెచ్చరించారు. ఆ తర్వాత కూడా బాబ్‌జాన్ వైఎస్ జగన్ చిత్రాలు, పాటలను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టేవాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి బాబ్‌జాన్ పీర్ల చావిడి వద్ద ఉండగా.. పూటుగా మద్యం సేవించి అక్కడికి వచ్చిన నలుగురు టీడీపీ కార్యకర్తలు అతనిపై గొడవకు దిగారు. తాము చెప్పినా వినకుండా మళ్లీ జగన్ పాటను వాట్సాప్ స్టేటస్ పెడతావా... అంటూ దాడి చేశారు. అక్కడికి వచ్చిన బాబ్‌జాన్ భార్యను అసభ్యపదజాలంతో దూషించారు. దీన్ని అవమానంగా భావించిన బాబ్‌జాన్ ఇంటికి వెళ్లి తలకు పూసుకునే వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఇప్పటికీ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకపోవడం గమనార్హం.



ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఖాద్రీశా.. గోవిందా

- ఖాద్రీశుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సోమవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి, వారాంతపు సెలవులు రావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి దర్శనం కోసం భారీగా తరలివచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఖాద్రీశున్ని స్మరిస్తూ గోవింద నామ స్మరణ చేయగా..ఆ ప్రాంతం మార్మోగింది. ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం చేసింది. సాయంత్రం వేళ మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

- జయంతి వేడుకల్లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

దేశానికే దిక్సూచి అంబేడ్కర్



ప్రజా సంఘాల నాయకులతో కలసి అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి టౌన్/ప్రశాంతి నిలయం: ప్రపంచంలోనే గొప్పదైన రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ దేశానికి దిక్సూచిలా నిలిచారని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పుట్టపర్తి పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో డాక్టర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే సింధూరారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...దేశంలోని అన్నివర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ కృషి చేశారన్నారు. భారత రాజ్యాంగం ద్వారా సమాజంలోని అన్ని వర్గాలకు సమానమైన అవకాశాలు కల్పించేలా చూశారన్నారు. ఏ అంశంపైనైనా సరే నేడు ప్రతి ఒక్కరూ ధైర్యంగా తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారంటే అది అంబేడ్కర్ కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ వల్లేనన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం వల్లే నేడు సామాన్యులు, బడుగు, బలహీన వర్గాల వారు చట్టసభల్లో అడుగుపెట్టి ప్రజల గొంతును వినిపించగలుగుతున్నారన్నారు. ఆ మహనీయుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, గిరిజన సంక్షేమశాఖ అధికారి మోహన్‌రామ్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తిప్పన్న, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డితో పాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం..

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాలను కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, కలెక్టరేట్ ఏఓ వెంకటనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. మహాలక్ష్మీ రథోత్సవం





విశేష అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి, రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి రథోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయాన్నే అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు పట్టు వస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీపూజ చేశారు. ఆలయ ఆవరణలో ఉంచిన రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి శాంతి, నవగ్రహ హోమం, గణపతి పూజ చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి రథంలో కొలువుదీర్చారు.

మహాలక్ష్మీ నమోస్తుతే..

రథంపై కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని భక్తులు తన్మయత్వం చెందారు. మహాలక్ష్మీ నమోస్తుతే అంటూ కీర్తించారు. అనంతరం రథాన్ని ఆలయ ప్రాంగణం నుంచి సమీపాన ఉన్న ప్రధాన రోడ్డు వరకు లాగారు. ఈ సందర్భంగా భక్తులు రథంపైకి అరటి పండ్లు, పూలు, తమలపాకులు తదితర వాటిని విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన బ్రహ్మణ కులస్తులు రాజవంశీకులతో కలిసి జ్యోతులను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తులతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రత్నగిరి సంస్థాన రాజవంశీకుడు దొర రంగప్పరాజు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



రథం లాగేందుకు పోటీ పడుతున్న భక్తులు

నేడు గంగ పూజ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి గంగ పూజ చేయనున్నట్లు రాజవంశీకుడు దొర రంగప్పరాజు, గ్రామ పెద్దలు తెలిపారు. గంగ పూజ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సాయికీర్తనం.. ఆనంద పరవశం

ప్రశాంతి నిలయం: సత్యసాయి కీర్తనలతో భక్తులు ఆనంద పరవశం చెందారు. తమిళ నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులో ప్రముఖ సంగీత విద్వాంసుడు విఘ్నేష్ బృందం సంగీత కచేరీ నిర్వహించింది. సుమారు గంట పాటు సత్యసాయిని కీర్తిస్తూ సాగిన కచేరీతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. అనంతరం వారంతా సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



కచేరీ నిర్వహిస్తున్న విఘ్నేష్ బృందం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సూర్యప్రభపై చౌడేశ్వరీదేవి

అమడగూరు: చౌడేశ్వరీదేవి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం మూడోరోజు సూర్యప్రభ వాహనంపై అమ్మవారు దర్శనమిచ్చారు. ఎప్పటిలానే చీకిరేవులపల్లి, నల్లగుట్లపల్లికి చెందిన రాజు, పెద్దక, కేతిరెడ్డి కుటుంబీకులు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన సూర్యప్రభపై కొలువుదీరిన అమ్మవారిని ఆలయం నుంచి పుర వీధుల గుండా గ్రామ నడిబొడ్డున ఉన్న ఉట్టి దగ్గర వరకూ తీసుకెళ్లారు. అనంతరం 2 గంటల పాటు అక్కడే కొలువుదీర్చగా భక్తులు పూజలు చేశారు. మహిళలు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని తిరిగి ఆలయానికి తీసుకువచ్చే సమయంలో డప్పు, వాయిద్యాలతో యువకులు చిందులేస్తూ ఆడిపాడారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి చంద్రప్రభ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమరెడ్డి, సర్పంచ్ సురేంద్రరెడ్డి, ఉత్తమరెడ్డి, పెద్దక శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కదిరి అర్బన్: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి నుంచి కదిరి కొండ చుట్టూ సోమవారం శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి భక్తులు గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీ నరసింహస్వామి జన్మ నక్షత్రం సందర్భంగా మహిమ గల ఖాద్రీ కొండకు గిరి ప్రదక్షిణ చేస్తే సకల పాపాలు హరించుకుపోతాయని భక్తుల నమ్మకం.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన తప్పనిసరి

- జిల్లా అగ్నిమాపక శాఖాధికారి హేమంత్‌రెడ్డి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి హేమంత్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను సోమవారం స్థానిక ఫైర్ స్టేషన్‌లో ఆయన ప్రారంభించి, మాట్లాడారు. విధి నిర్వహణలో అమరవీరులైనా ఫైర్‌మెన్లకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 1944, ఏప్రిల్ 14న ముంబైలో జరిగిన అగ్నిప్రమాదంలో (బాంబే డాక్ ఫైర్) మొత్తం 800 మంది మృత్యువాత పడ్డారు. ఇందులో 66 మంది అగ్నిమాపక సిబ్బంది ఉన్నారన్నారు. అప్పటి నుంచి విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన అమర వీరులను స్మరించుకుంటూ అగ్నిమాపక వారోత్సవాలను జరుపుకుంటున్నట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణపై వారం రోజుల పాటు ప్రజలకు వివిధ రూపాల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 15న జనసంచారిత ప్రాంతాల్లో, విద్యాసంస్థల్లో, గ్యాస్ గోడౌన్లు, పెట్రోల్ బంక్‌లలో వారం రోజుల పాటు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏడీఎఫ్‌ఓలు, నాగరాజునాయక్, శంకర్‌ప్రసాద్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల నెత్తిన గుదిబండ

- ఒక్కో వంట గ్యాస్ సిలిండర్‌పై అదనంగా రూ.50 పెంపు
- జిల్లా వినియోగదారులపై ఏటా రూ.24.25 కోట్ల అదనపు భారం



ప్రశాంతి నిలయం: జిల్లా వాసులపై వంట గ్యాస్ రూపంలో అదనపు భారం పడింది. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానికి అంటుతుండడంతో అవస్థలు పడుతున్న సామాన్యులకు వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 ధర పెంచి కూటమి సర్కార్ షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై ఏ మాత్రం చిత్తశుద్ధి చూపని పాలకులు.. నిత్యావసర సరుకుల ధరలు, వంట గ్యాస్, ఇంధన ధరలను పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 32 మండలాల పరిధిలో ఐఓసీ, హెచ్‌పీసీ, బీపీసీ కంపెనీల ద్వారా 39 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో జిల్లా వ్యాప్తంగా సాధారణ గృహ వినియోగ సిలిండర్లు 8,08,489 ఉన్నాయి. మరో 7,737 నాన్ డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయి.

ఏటా రూ.24.25 కోట్ల భారం..

గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనంగా పెంచడంతో జిల్లా వాసులపై ఏటా రూ.24.25 కోట్ల భారం పడనుంది. జిల్లాలో 8,08489 గ్యాస్ కనెక్షన్లు ఉండగా ఒక్కో కనెక్షన్ ద్వారా ఏడాదికి 6 సిలిండర్లు చొప్పున 48,50,934 సిలిండర్లు వినియోగిస్తున్నారు. గతంలో 14.20 కిలోల సిలిండర్ ధర జిల్లా కేంద్రంలో రూ.870 ఉండగా పెంచిన తర్వాత రూ.930కి చేరింది. రవాణా చార్జీల రూపంలో దూరాన్ని బట్టి మరో రూ.30 నుంచి రూ.50ను, డెలివరీ చేసినందుకు అంటూ బాయ్స్ మరో రూ.20 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో గృహ వినియోగదారులు సిలిండర్ కొనుగోలు చేయాలంటే రూ.1000 వరకు వెచ్చించాల్సి వస్తోంది.

ధర తగ్గించాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలను ఏ మాత్రం నెరవేర్చడం లేదు. పైగా నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగినా పట్టించుకోవడం లేదు. నెలసరి ఖర్చుల భారం మోయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడేమో గ్యాస్ సిలిండర్‌పై రూ.50 ధర పెంచడం తగదు. వెంటనే పెంచిన సిలిండర్ రేటును వెంటనే తగ్గించాలి. – సాయిలీల, ప్రశాంతి గ్రామ్

పేదలపై భారం



నిత్యావసరాల ధరల పెరుగుదలతో కొనుగోలు శక్తి లేక చాలా మంది పేదలు ఇబ్బంది పడుతున్నారు. ఇంధన ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచిందనే సాకు చూపి వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం సబబు కాదు. పెంచిన ధరను వెంటనే తగ్గించి పేదలకు న్యాయం చేయాలి. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తే ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదు. – కవిత, గోకులం, పుట్టపర్తి

మందు అడిగితే ఇవ్వలేదని వ్యక్తిపై దాడి



గాయపడిన గంగాధర్

యాడికి: తాగేందుకు మందు ఇవ్వలేదన్న అక్కసుతో ఖాళీ మద్యం బాటిళ్లతో వ్యక్తిపై దాడి చేసిన ఘటన యాడికిలో సంచలనం రేకెత్తించింది. బాధితుడు తెలిపిన మేరకు.. యాడికి మండలం కోనుప్పలపాడు గ్రామానికి చెందిన మంగల గంగాధర్ సోమవారం వ్యక్తిగత పనిపై మండల కేంద్రానికి వచ్చాడు. మధ్యాహ్నం కుంటకు వెళ్లే మార్గంలో ఉన్న బ్రాందీ షాపులో మద్యం బాటిల్ కొనుగోలు చేసి, ఆ పక్కనే మిగిలిన వారితో కలసి తాగుతూ కూర్చొన్నాడు. అదే సమయంలో గంగాధర్‌తో ఎలాంటి ముఖపరిచయం లేని యాడికి గ్రామానికి చెందిన మహేష్ అక్కడకు చేరుకుని తనకూ తాగేందుకు మద్యం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇందుకు గంగాధర్ నిరాకరించడంతో మహేష్ వాగ్వాదానికి దిగాడు. దుర్భాషలాడుతూ ఆ పక్కనే పడి ఉన్న ఖాళీ మద్యం గాజు బాటిల్ తీసుకుని గంగాధర్ తలపై బలంగా బాదాడు. దీంతో గంగాధర్ తలకు తీవ్ర రక్తగాయమైంది. సమాచారం అందుకున్న గంగాధర్ సమీప బంధువు అక్కడకు చేరుకుని వెంటనే క్షతగాత్రుడిని స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. విషయం తెలుసుకున్న యాడికి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దాడికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహేష్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

ప్రాణం పోసిన మెడిసిన్ వైద్యులు



కోలుకున్న నాగేంద్రకు సేవలందిస్తున్న స్టాఫ్‌నర్సులు (చిత్రంలో) భార్య సుకన్య

అనంతపురం మెడికల్: ప్రాణాపాయ స్థితిలో చికిత్స ఆస్పత్రికి చేరుకున్న రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా అతని ప్రాణాలను ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని మెడిసిన్ విభాగం వైద్యులు కాపాడారు. కంబదూరు మండలం ఒంటిరెడ్డిపల్లికి చెందిన 34 ఏళ్ల వయసున్న నాగేంద్ర.. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉన్నఫళంగా కాళ్లు చేతులు పడిపోయి, మాట రాకపోవడంతో ఈ నెల 7న కుటుంబసభ్యులు సర్వజనాస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అక్యూట్ మెడికల్ కేర్‌లో అడ్మిట్ చేసుకుని మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ భీమసేనాచార్ నేతృత్వంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పావని తదితరులు చికిత్స మొదలు పెట్టారు. గులియన్ బరీ సిండ్రోమ్‌తో బాధపడుతున్నట్లుగా నిర్ధారణ అయిన తర్వాత పీజీ వైద్యులు, స్టాఫ్‌నర్సులు నాగేంద్రకు రౌండ్ ద క్లాక్ సేవలందించారు. రూ.7వేలు విలువ చేసే ఇంజెక్షన్లను క్రమం తప్పకుండా 20కి పైగా అందించాల్సి వచ్చింది. వెంటిలేటర్‌పై ఉన్న నాగేంద్ర కోలుకోవడంతో వార్డుకు షిఫ్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. తమకు ముగ్గురు పిల్లలున్నారని, ఆస్పత్రి వైద్యులు తన భర్తకు ఊపిరి పోశారని, వారి మేలును ఎన్నడూ మరవనంటూ వైద్యులు, స్టాఫ్‌నర్సులు, తదితర సిబ్బందికి భార్య సుకన్య కృతజ్ఞతలు తెలిపింది. ప్రైవేట్‌గా ఈ తరహా వైద్యం పొందాలంటే రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందని ఆస్పత్రి వైద్యులంటున్నారు.

పేలుడు పదార్థం తిని గొర్రె మృతి

ఎన్‌పీ కుంట: అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన నల్ల మందు ఉంట (పేలుడు పదార్థం) తిని గొర్రె మృతి చెందిన ఘటన సోమవారం ఎన్‌పీకుంటలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి భాస్కర్ తన గొర్రెలను రోడ్డుకు సమీపంలోని చవట గుంతల వద్ద మేపుతుండగా ఓ గొర్రె నల్లమందు ఉంటను నోట్లోకి తీసుకుని నమలడంతో ఒక్కసారిగా అది పేలింది. ఘటనతో గొర్రె అక్కడికక్కడే మృతిచెందింది. ఘటనపై గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేశారు. జీవాలు, పశువులు మేపు సమయంలో నల్లమందు ఉంటలపై కాలు పెట్టినా పేలుడు ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

19న వివాహం...
యువతి బలవన్మరణం

- పెళ్లి భజంత్రీ మోగాల్సిన ఇంట విషాదం
- మృతురాలు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్



రేణుక మృతదేహం

రాప్తాడు రూరల్: పెళ్లి భజంత్రీ మోగాల్సిన ఇంట కాబోయే పెళ్లికూతురు బలవన్మరణంతో తీవ్ర విషాదం నెలకొంది. అనంతపురం రూరల్ మండలం పూలకుంటలో సోమవారం జరిగిన ఈ ఘటన కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన మేరకు... పూలకుంట గ్రామానికి చెందిన కురుబ నారాయణస్వామికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్దమ్మాయికి వివాహమైంది. రెండో అమ్మాయి రేణుక (24) ఆకుతోటపల్లి–1 సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది. ఈమెకు ఓ ప్రభుత్వ ఉద్యోగితో పెద్దలు పెళ్లి నిశ్చయించారు. ఈ నెల 19న పెళ్లి జరగాల్సి ఉంది. ఇందుకోసం ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి. కుటుంబసభ్యులు ఓవైపు పెళ్లి పత్రికల పంపిణీ చేస్తూనే మరోవైపు పెళ్లికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంటికి బంధువుల రాక కూడా మొదలైంది.

పెళ్లంటే ఇష్టం లేక....

అయితే రేణుకకు పెళ్లంటే ఇష్టం లేదు. ఇదే విషయాన్ని పలుమార్లు సచివాలయంలో సహచర ఉద్యోగులతో చెప్పేది. 'పెళ్లి చేసుకున్న తర్వాత జీవితం ఎలా ఉంటుందో...అత్త మామలు ఎలా ఉంటారో....ఇప్పుడున్నట్లు పెళ్లి చేసుకున్న తర్వాత ఉండేందుకు ఉండదు... కొత్తగా పెళ్లి చేసుకున్న వారి కాపురాలు చాలా చూస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో పెళ్లి ఎందుకు చేసుకోవాలో?' అని చర్చించేది. మరోవైపు పెళ్లి తేదీ దగ్గరకు వస్తుండడంతో హడావుడి పెరిగిపోయింది. ఇక పెళ్లి చేసుకోవాల్సి వస్తుందని, తల్లిదండ్రులకు చెప్పుకోలేక తీవ్ర ఆందోళనకు గురైన ఆమె సోమవారం ఉదయం మేడపై ఉన్న గదిలోకి వెళ్లి తలుపు వేసుకుని ఫ్యానుకు ఉరి వేసుకుంది. ఎంతసేపటికీ కిందకు రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు పైకి వెళ్లి చూడగా ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమార్తె కనిపించింది. సమాచారం అందుకున్న ఇటుకలపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మాజీ సైనికుడి మృతి



ఆదినారాయణ (ఫైల్)

హిందూపురం అర్బన్: స్థానిక న్యూ హస్నాబాద్‌లో నివాసముంటున్న మాజీ సైనికుడు ఎ.ఆదినారాయణ (86) సోమవారం అనారోగ్యంతో కన్నుమూసారు. ఆయనకు భార్య గ్రేస్ ఆదిలక్ష్మీదేవి, కుమార్తె సుమలత, కుమారులు కామేష్, నాగేంద్రకుమార్ (ఎస్‌డీజీఎస్ కళాశాల ప్రిన్సిపాల్), స్టీఫెన్‌రాజ్, మనవలు, మనుమరాళ్లు ఉన్నారు. 24 ఏళ్లపాటు సైన్యంలో పనిచేసిన ఆయన 1971లో జరిగిన పాకిస్తాన్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి శత్రుసైనికులను దేశంలో చొరబడకుండా అడ్డుకున్నారు. ఆదినారాయణ మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



గంజాయిని చూపుతున్న పోలీసులు

కదిరి టౌన్: తనకల్లు మండలం గోవిందువారిపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. సోమవారం ఉదయం గోవిందవారిపల్లి వద్ద నలుగురు అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా గమనించిన తనకల్లు ఎస్‌ఐ గోపి వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఆ సమయలో వారు అక్కడి నుంచి పారిపోతుండడంతో అనుమానం వచ్చి కానిస్టేబుళ్లు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 7 ప్లాస్టిక్ ప్యాకెట్లలో ఉన్న గంజాయి, 4 సెల్‌ఫోన్లు, రూ.1,100 నగదు స్వాధీనం చేసుకుని డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో పంచనామా చేయించారు. నిందితులను బాలంగిరి జిల్లా నూంహాడ్ గ్రామానికి చెందిన తులసీ పరదు, అన్నమయ్య జిల్లా ముదివేడు మండలం గుట్టమీద సాహెబుల పల్లికి చెందిన రెడ్డి బాషా, మొలకలచెరువు మండలం ఎపురకోటకు చెందిన కె.నరసింహులు, అన్నమయ్య జిల్లా బాలసముద్రం గ్రామానికి చెందిన సురేందర్‌గా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి బలవన్మరణం

చెన్నేకొత్తపల్లి: వ్యాపారంలో నష్టాలు తాళలేక ఓ చిరువ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని సుందరయ్యనగర్‌కుచ ఎందిన ఆదిసుబ్బయ్య (42)కు భార్య భారతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పండ్ల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇందు కోసం అప్పులు చేశాడు. అయితే వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులు తీర్చలేక మదనపడేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన ఆయన ద్విచక్ర వాహనంపై చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రైలు పట్టాలపై భారీ వాహనాలు వెళ్లకుండా ఏర్పాటు చేసిన ఇనుప బ్యారికేడ్‌కు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులతో పాటు పోలీసులూ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవు



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: సామాజిక మాధ్యమాల వేదికగా కులమతాలు, వర్గాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యాఖ్యలు పోస్టు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రత్న హెచ్చరించారు. సోషల్ మీడియా పోస్టింగ్‌లపై సోమవారం డీపీఓలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కదిరి డీఎస్పీ శివన్నారాయణస్వామితో కలసి ఎస్పీ మాట్లాడారు. కదిరి ఆర్‌ఐ మున్వర్‌బాషా దొంగ పట్టాలు సృష్టించి ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్న అంశంలో 6 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో రెండు కేసుల్లో ఆయన యాంటిసిపేటరీ బెయిల్ తెచ్చుకున్నారన్నారు. అనంతరం కదిరి ఇన్‌స్పెక్టర్‌ను మున్వర్‌బాషా రెచ్చగొట్టేలా మాట్లాడారన్నారు. అలా మాట్లాడడం మంచిది కాదని చెప్పినా వినకుండా మొత్తం అంశాన్ని రికార్డు చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారన్నారు. వర్గాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరించిన మున్వర్‌బాషాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇలాగే హిందూపురంలోనూ ఓ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సోషల్ మీడియా సీఐ తిమ్మారెడ్డి, ఎస్‌బీ ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసు నమోదు

తాడిమర్రి: తమ విధులకు ఆటంకం కలిగించారంటూ శివంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లే సాయినాథ్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శనివారం తాడిమర్రిలో లక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీజేలో ఆ పార్టీకి చెందిన పాటలు వేయడాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అయితే ఎవరికీ ఇబ్బంది లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటామని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరినా పోలీసులు వినలేదు. తమ విధులకు ఆటంకం కలిగించారంటూ కేసు నమోదు చేశారు.

సత్తా చాటిన కస్తూరిబా విద్యార్థినులు

పుట్టపర్తి అర్బన్: ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని 30 కస్తూరిబా కళాశాలల విద్యార్థినులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 877 మంది పరీక్షలు రాయగా, 599 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 641 మంది పరీక్షలు రాయగా 557 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో 68 శాతం, రెండో సంవత్సరంలో 87 శాతం ఫలితాలు సాధించినట్లు సమగ్ర శిక్ష జిల్లా కో–ఆర్డినేటర్ దేవరాజ్ తెలిపారు.

జాతీయ హోమియో వైద్యుల సంఘంలో జిల్లా వాసులకు చోటు



డాక్టర్ కుమారయ్య, డాక్టర్ శాంతిప్రియ

అనంతపురం మెడికల్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లా వాసులకు చోటు దక్కింది. ఈ నెల 13న గుంటూరులో అఖిల భారత హోమియో వైద్యుల సంఘం 18వ రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన సీనియర్ హోమియోపతి వైద్యుడు డాక్టర్ పోగుల కుమారయ్య, రాష్ట్ర విభాగం కో ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం.శాంతిప్రియకు అవకాశం దక్కింది. డాక్టర్ పోగుల కుమారయ్య మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో హోమియో వైద్యం ప్రాముఖ్యత, నూతన ఆవిష్కరణలు, సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి గోవిందనాయక్ హెచ్చరించారు. నవోదయం 2.0 భాగంగా నాటు సారా నిర్మూలకు సోమవారం బుక్కపట్నం మండలం నార్శింపల్లి తండాలో జిల్లా అధికారులలో కలసి దాడులు నిర్వహించారు. 540 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 4 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నార్శింపల్లి తండాకు చెందిన అలివేలుబాయి, కిరణ్‌నాయక్, శ్రీరాములు నాయక్‌పై కేసు నమోదు చేశారు. పుట్టపర్తి రూరల్ మండలం వెంగలమ్మచెరువు గ్రామంలో దాడులు నిర్వహించి 90 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, గంగులయ్యపై కేసు నమోదు చేశారు. దాడుల్లో అసిస్టెంట్ ప్రొహిబిషన్ అధికారి నరసింహులు, సీఐ నాగరాజు, ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రాజుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

కదిరి అర్బన్: బాలప్పగారిపల్లి తండా సమీపంలోని కొండగుట్టల్లో సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన 452 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అలీ, ఎక్సైజ్ సీఐ శ్రీధర్, బాబు, దత్తాత్రేయతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్, రాగి అపహరణ

కూడేరు: దొంగలు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేశారు. కూడేరు పోలీస్ స్టేషన్‌కు సమీపంలో అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ పొలంలోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఆదివారం రాత్రి దొంగలు ధ్వంసం చేసి, ఆయిల్, రాగి ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం కడదరకుంటకు చెందిన రైతు రామసుబ్బానాయుడు పొలంలోకి వెళ్లగా ట్రాన్స్ ఫార్మర్లను ధ్వంసం చేసి ఉండడాన్ని గమనించాడు. 70 హెచ్‌పీ ట్రాన్స్ ఫార్మర్‌లో 175 లీటర్ల ఆయిల్, 25 హెచ్‌పీ ట్రాన్స్ ఫార్మర్‌లో 100 లీటర్ల ఆయిల్, రాగి ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు రామసుబ్బానాయుడు, రమేష్, భాస్కర్, సుధీర్ తెలిపారు. బాధిత రైతులు ట్రాన్స్‌కో ఏఈ గౌస్, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫేక్ సర్టిఫికెట్లపై ముమ్మర విచారణ

- సర్టిఫికెట్లను అందజేయాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఆదేశాలు


తాడిపత్రి రూరల్: ఉమ్మడి జిల్లాలోని ఐసీడీఎస్ కార్యాలయాల పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సంబంధించిన ఫేక్ సర్టిఫికెట్లపై విచారణ వేగవంతమైంది. తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టులో ప్రారంభమైన ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా విచారణకు కారణమైంది. ప్రకాశం జిల్లాలోనూ ఇదే తరహాలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందినట్లుగా గుర్తించారు. దీంతో ఉద్యోగంలో నుంచి తొలగిస్తారనే భయంతో తాడిపత్రి ప్రాజెక్టులో మాదిరిగా కొందరు హైకోర్టుకు వెళ్లడంతో ఐసీడీఎస్ డైరెక్టరేట్‌కు తలనొప్పిగా మారింది. దీంతో ఈ వివాదానికి చెక్‌పెట్టేలా సమగ్ర విచారణ బాధ్యతను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అప్పగించారు. దీంతో రాష్ట్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఉద్యోగంలో చేరిన సమయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమర్పించిన నకళ్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు.. వాటిని సరిపోల్చుకునేందుకు ఒరిజనల్ సర్టిఫికెట్లు సంబంధిత ఐసీడీఎస్ కార్యాలయాల్లో స్వయంగా అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల మేరకు తొలుత ఒరిజనల్ సర్టిఫికెట్లను స్వీకరించిన సీడీపీఓలు వాటిని స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారా డైరెక్టరేట్‌కు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. విచారణలో ఫేక్ సర్టిఫికెట్లను సమర్పించిన వారిని ఉద్యోగంలో నుంచి తొలగించడమే కాక వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

ముగిసిన రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు



అలంకరణలో రంగనాథస్వామి

తాడిపత్రి: ఆలూరు కోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల ఆఖరి రోజు సోమవారం స్వామి వారికి కోనలో తీర్థవాది, వసంతోత్సవం, చక్రస్నానం వంటి కార్యక్రమాలు అర్చకులు జరిపించారు. అనంతరం స్వామి వారికి పుష్పయాగ కార్యక్రమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాత్రికి రంగనాథస్వామి వారు హంసవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.



భక్తుల సమక్షంలో స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు